క్లుప్తంగా

ఉద్యోగాలకు ఆరుగురి ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక కలెక్టరేట్‌లో వికాస ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 29 మంది పాల్గొనగా ఆరుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. డిక్సన్‌కు ఐదుగురు, టైర్ మ్యానిఫ్యాక్చరింగ్ కంపెనీకి ఒకరు ఎంపికయ్యారన్నారు. ఈ మేళాలో వికాస మేనేజర్ సత్యనారాయణ, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సూచించారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. న్యాయస్థానాల్లోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, న్యాయవాదులు, పేదలకు జీఎస్ఎల్ సహకారంతో డాక్టర్ తరుణ్ క్యాన్సర్‌పై వివరించారు. దీనికి అందుబాటులో ఉన్న వైద్యం, చికిత్సలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ ముందుగానే రోగాన్ని గుర్తిస్తే సులువుగా నయం చేయవచ్చన్నారు. క్యాన్సర్‌కు సంబంధిత సందేహాలను వైద్యుల సహాయంతో న్యాయస్థానం సిబ్బంది నివృత్తి చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి అన్నారు. అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

30న వర్క్‌షాప్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 30న అధ్యాపకులు, పరిశోధకులకు మేధోసంపత్తి, హక్కులపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు శనివారం తెలిపారు. దీనికి ఈవ మేధోసంపత్తి హక్కుల ప్రచార సంస్థకు చెందిన మద్దిపాటి శ్రీనివాస్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తారన్నారు.

పరుగుపందెం పోటీల్లో ప్రతిభ

ప్రకాశంనగర్: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరుగు పందెం 10కే (ఓపెన్ స్టేట్ మీట్) పోటీల్లో ఎస్‌కేవీటీ కళాశాలకు చెందిన ఎస్‌జే వేదవ్యాస్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ విషయాన్ని శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు తెలిపారు. విద్యార్థికి అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆకుల హైమ పతకాన్ని అందించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ శాఖాధిపతి పీఏ కిశోర్‌బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్ పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ బొమ్మూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజును శనివారం డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. త్యాగరాజు సతీమణి రమాదేవి ఇటీవల మృతి చెందారు. అలాగే రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాలేపల్లి మురళీధర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాధనాల శివ, ఐఎన్‌టీయూసీ నాయకులు నారపురెడ్డి మురళి, హుకుంపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు కురుమళ్ల ఆంజనేయులు, కాపు సంఘ నేత మెట్ల వెర్రియ్య, మహిళా ఉద్యోగ సంఘ నాయకురాలు రామలక్ష్మి తదితరులు పరామర్శించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కడియం: గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం ద్వారా తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి అన్నారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా వేమగిరిలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏసీడీపీఓ కనకవల్లి, అమెరికా ఇండియా ఫౌండేషన్ కోఆర్డినేటర్ దీపిక, వైద్య సిబ్బంది సత్యశ్రీ పాల్గొన్నారు. అలాగే వీరవరంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిగాయి. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ పూజ


రథంవీధిలో సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు

ధవళేశ్వరం: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ధవళేశ్వరం రథంవీధిలోని వరసిద్ధి వినాయక మండపం వద్ద శనివారం యడ్ల మహేష్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజను వైభవంగా నిర్వహించారు. పలువురు చిన్నారులచే సరస్వతీ పూజ చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రథంవీధి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు గీతా బాబి, ఆకోజు యేసువరప్రసాద్, దిండి జగదీష్, సంగారెడ్డి సత్తిబాబు, కవల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెళ్లిరా.. బొజ్జగణపయ్యా..

- నిమజ్జనోత్సవాలకు సర్వం సిద్ధం
- రేవుల వద్ద రోప్‌లు, పంట్ల ఏర్పాటు
- జాగ్రత్తలు పాటించాలని పోలీసుల సూచన


ధవళేశ్వరం రామపాదాల రేవు

ధవళేశ్వరం: విఘ్నరాజుని వేడుక వాడవాడలా జరుగుతోంది.. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఊరులో మండపాలు ఏర్పాటయ్యాయి.. భక్తిశ్రద్ధలతో గణనాథుడిని కొలుస్తున్నారు.. వినాయక చవితి అనంతరం ఐదో రోజు నుంచి పద మూడో రోజు వరకూ విగ్రహాలను నిమజ్జనం చేస్తుంటారు. శనివారం ఆరో నుంచే ఈ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా గణేశ విగ్రహాల నిమజ్జనోత్సవాలకు ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రామపాదాల రేవు వద్ద రోప్‌లు, పంట్లు, గజ ఈతగాళ్లను పంచాయతీ అధికారులు పెడుతున్నారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ధవళేశ్వరం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ధవళేశ్వరంతో పాటు పరిసర గ్రామాల నుంచి సుమారు 300 విగ్రహాలను స్థానిక రామపాదాల రేవు వద్ద నిమజ్జనోత్సవానికి తీసుకువచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం గోదావరి ఉధృతి అధికంగా ఉండటంతో ఈ రేవు వద్ద అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఉత్సవ సమయంలో కమిటీ సభ్యులు నిబంధనలను పాటించాలని పోలీసులు ఇప్పటికే వివరించారు.

గోదావరి గలగల..

గోదావరి ఉధృతి ప్రస్తుతం ఎక్కువగా ఉంది. రామపాదాల రేవు నుంచి నీరు వేగంగా వెళ్తుంది. బ్యారేజీ నుంచి సుమారు 3 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను దాటి ప్రతి రోజూ విడుదల చేస్తున్నారు. బ్యారేజీకి సమీపంలోనే రామపాదాల రేవు ఉండటంతో అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రేవులో రోప్ ఏర్పాటు చేశారు. దీనిని దాటి ముందుకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు పంట్లు పెట్టారు. అదే విధంగా గజ ఈతగాళ్లను రేవు వద్ద అందుబాటులో ఉంచారు.

నిబంధనల గీత దాటొద్దు

నిమజ్జనోత్సవం సమయంలో గోదావరిలో లోతుకు వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు. రోప్ దాటి ముందుకు వెళితే చర్యలు తీసుకుంటామని అంటున్నారు. అదే విధంగా అనుమతులు లేకుండా డీజేలు, లౌడ్ స్పీకర్లను పెడితే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ రేవు వద్ద గతంలో పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..



నిమజ్జనోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. రామపాదాల రేవు వద్ద రోప్ దాటి లోపలకు వెళితే చర్యలు తీసుకుంటాం. పోలీసులకు అందరూ సహకరించాలి.

– కె.మంగాదేవి, సీఐ ,ధవళేశ్వరం

ప్రత్యేక ఏర్పాట్లు చేశాం..



ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. రోప్, పంట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాం. నిమజ్జనోత్సవానికి తరలివచ్చే ఉత్సవ కమిటీలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఉత్సవ కమిటీలూ తమ సిబ్బంది సూచనలు పాటించాలి.

– డి.సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

యూనివర్సిటీ బ్యాడ్జీలను విధిగా ధరించాలి


విద్యార్థులకు యూనివర్సిటీ బ్యాడ్జీలను ప్రదానం చేసిన శ్యామ్‌రాజ్‌నాయక్

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ కళాశాల విద్యార్థులు అధికారిక కార్యక్రమాల్లో విధిగా యూనివర్సిటీ లీపెల్ పిన్స్ బ్యాడ్జీలను ధరించాలని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్యామ్‌రాజ్‌నాయక్ సూచించారు. స్థానిక ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా శనివారం విద్యార్థినీ విద్యార్థులకు యూనివర్సిటీ లీపెల్ పిన్స్ బ్యాడ్జీలను ఆయన ప్రదానం చేశారు. ఈ బ్యాడ్జీలలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారిక ముద్ర ముద్రించారని అసోసియేట్ డీన్ తెలిపారు. ఓఎస్‌ఏ డాక్టర్ విజయశంకర్‌బాబు, ప్రొఫెసర్లు విజయకృష్ణకుమార్, భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ గూడూరి
- 38వ డివిజన్‌లో గడప గడపకూ..


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక 38వ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ వాటర్ ట్యాంక్‌ల వద్ద నుంచి డివిజన్ ఇన్‌చార్జి, ఉమా కోటిలింగేశ్వర ఆలయ చైర్మన్ అరిగెల బాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను శ్రీనివాస్ అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదల ముంగిటకు వెలుగులు వచ్చాయన్నారు. మహిళలకు సీఎం జగన్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రిజర్వేషన్లు కల్పించి వారికి ఉన్నత పదవులు ఇచ్చారన్నారు. ప్రతి పథకంలోనూ మహిళలకు భాగస్వామ్యం కల్పించి ఆర్థిక ప్రగతికి బాటలు వేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా అంతా సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, నాయకులు సుంకర అంజిబాబు, రఘుపతి సాయిబాబా, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాలపై జిల్లా స్థాయి సెమినార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో తృణధాన్యాలపై జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ శనివారం నిర్వహించారు. తృణధాన్యాలు పోషకాహారమా లేక వ్యామోహమా అనే అంశంపై ఈ సెమినార్ జరిగిందని జిల్లా సైన్స్ అధికారి జి.నెహ్రూ తెలిపారు. మొత్తం 11 మండలాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని వారి ప్రాజెక్టులు సమర్పించారన్నారు. గోపాలపురం మండలం కొవ్వూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.వాసుకృష్ణ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 25న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో అతను పాల్గొంటాడన్నారు. న్యాయ నిర్ణేతగా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ ఎం.విజయ శంకర్‌బాబు వ్యవహరించారు. జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ శ్రీనివాస్, ఎంఈవో గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ నాగేశ్వర్
- కడియపులంకలో గడప గడపకూ..


కడియపులంకలో పథకాల గురించి వివరిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పార్టీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కడియపులంక సచివాలయం–1 పరిధిలో శనివారం నాల్గో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయన వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. అనంతరం నాగేశ్వర్ మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించడం ద్వారా అప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అలాగే రోడ్లు, డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం నేరుగా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే గుర్తించి, వారికీ వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చందన వివరించారు. దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, నాయకులు ఊటుకూరి శైలజ, ఆరేటి వెంకట్రావు, చీకట్ల మాచరయ్య, ఆలమూరి శ్రీను, తిరుమలశెట్టి వాసు, అయితిరెడ్డి అయ్యప్ప, బోడపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన ప్రణాళికలు రూపొందించాలి



పరిశోధన కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రాచారి

అల్మాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సమగ్ర పోషకాల యాజమాన్యంలో కచ్చితమైన పరిశోధనా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఐసీఏఆర్ సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్ అగ్రానమి విభాగాధిపతి డాక్టర్ రవీంద్రాచారి అన్నారు. స్థానిక సీటీఆర్ఐ సెమినార్ హాల్లో మూడు రోజుల పాటు జరిగే పరిశోధన కమిటీ సమావేశాల్లో రెండో రోజు శనివారం పంటల యాజమాన్య పద్ధతులు, భూసార, రసాయన విభాగంలోని పరిశోధనలపై చర్చించారు. దీనికి అధ్యక్షత వహించిన రవీంద్రాచారి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు తమ ప్రయోగాల్లో వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ వాతావరణంలోని విభిన్న అంశాలైన ఉష్ణోగ్రత, వర్షపాతం, భూసార అంశాలు, నేలలోని అజో స్పైరిల్లమ్, ఫాస్ఫో బ్యాక్టీరియా, మైక్రోఫ్లోరా వంటి విభిన్న అంశాలపై లోతుగా పరిశీలించాలన్నారు. విభాగాధిపతులు యు.శ్రీధర్, సి.చంద్రశేఖరరావు ఈ పరిశోధనా ఫలితాలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సూచనలను అందించారు.

గోదావరి పవిత్రతను కాపాడుకుందాం

కమిషనర్ దినేష్‌కుమార్


ఘాట్‌ను శుభ్రం చేసే పనుల్లో కమిషనర్ దినేష్ కుమార్, ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి పవిత్రతను కాపాడుకునేందుకు, నదీ కాలుష్య నివారణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో చేపట్టిన స్వచ్ఛతాహి సేవ, ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాల్లో భాగంగా శనివారం నగరంలోని ఘాట్‌లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులతో కలసి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. పవిత్ర గోదావరి నదిలో వ్యర్థాలు కలవకుండా ప్రజలే బాధ్యత వహించాలన్నారు. నది కలుషితం కాకుండా నగరపాలక సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్రాజెక్టు కింద నిధులు పొందేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. ఘాట్లను శుభ్రపరచే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను, సిబ్బందిని కమిషనర్ అభినందించారు. డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎ.వినూత్న తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో అన్ని రంగాల్లో విజయం



బెలూన్లు ఎగురవేసి బధిరుల వారోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న చందన నాగేశ్వర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కృషి, పట్టుదలతో బధిరులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో జరుగుతున్న ప్రపంచ బధిరుల వారోత్సవాలకు శనివారం ఆయన హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి, బెలూన్లు వారోత్సవాల ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ శరీరంలో లోపం ఉందని ఎవరూ కుంగిపోవాల్సిన అవసరం లేదని, ఉన్నత లక్ష్యంతో సాగితే విజయం వరిస్తుందన్నారు. గతంలో బధిరులు చాలా కష్టాలకు గురయ్యేవారని, విద్య, ఉద్యోగ రంగాల్లో వెనకంజలో ఉండేవారన్నారు. నేడు వారికి అవసరమైన అన్ని సౌకర్యాలతో విద్య అందుతోందని, ఉద్యోగ సాధనలో ముందు వరుసలో ఉంటున్నారన్నారు. ప్రియదర్శిని ఆశ్రమంలో చదువుతున్న విద్యార్థుల్లో చాలామంది పోలీసు, సచివాలయాల ఉద్యోగాల్లో స్థిరపడడమే దీనికి నిదర్శనమన్నారు. వీరికి తోడ్పాటు అందిస్తున్న ప్రియదర్శిని ఆశ్రమ నిర్వాహకురాలు కె.స్వప్నవర్మను ఆయన అభినందించారు. స్వప్నవర్మ మాట్లాడుతూ ప్రపంచ బధిర దినోత్సవాలు ఆశ్రమంలో వారం రోజుల పాటు నిర్వహించనున్నామన్నారు. ఆశ్రమ ప్రిన్సిపాల్ కె.ఆశాలత, ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రేమలత, నిర్మల, ఎలిషారాజ్ కుమార్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

యెహోవా సాక్షుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని వెంకటాద్రి గార్డెన్స్‌లో యెహోవా సాక్షుల సమావేశం రెండో రోజు శనివారం స్థానిక ప్రతినిధి కె.వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 6 వేల ప్రాంతాల్లో ఈ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. 'ఓర్పు చూపించండి' అనే అంశంపై ప్రసంగించారన్నారు. కుటుంబంలో పిల్లలు, పెద్దలు, భార్యాభర్తలు ఓర్పు ఎలా ప్రదర్శించవచ్చో చర్చించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు.

పరిజ్ఞానం పెంచుకోవాలి


సెమినార్‌లో మాట్లాడుతున్న కేంద్ర రక్షణ మంత్రిత్వ సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి

కంబాలచెరువు: విద్యార్థులు విద్యలో నూతన పరిజ్ఞానం పెంచుకోవాలని కేంద్ర రక్షణ మంత్రిత్వ సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. స్థానిక జేఎన్ రోడ్డులోని చెరుకూరి వీర్రాజు కన్వెన్షన్ సెంటర్‌లో ఇన్‌స్పైరింగ్ యంగ్ మైండ్స్ సెమినార్ శనివారం జరిగింది. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ పురోగతికి యువత కీలకం కావాలన్నారు. దేశ భవిష్యత్‌కు రక్షణ రంగం చాలా ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. సెమినార్‌లో గౌతమీ స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్, పూర్వ విద్యార్థి పీఆర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: సెల్‌ఫోన్ విషయంలో కుమారుడితో గొడవపడిన ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పోలిశెట్టి శివకుమార్ భార్య చనిపోవడంతో పోలిశెట్టి పుష్ప (31)ను వివాహం చేసుకున్నాడు. శివకుమార్ మొదటి భార్యకు ప్రసాద్ కుమారుడు కాగా, ఓ కుమార్తె ఉంది. శివకుమార్, పుష్పలకు ఓ బాబు జన్మించాడు. అయితే ప్రసాద్ సెల్‌ఫోన్‌తో ఉంటుండడంతో దానిని పుష్ప తీసుకుంది. శనివారం ఉదయం ఈ విషయంలో పుష్ప, ప్రసాద్‌లకు గొడవ జరిగింది. మనస్తాపం చెందిన పుష్ప ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకుంది. ఈలోగా ఇంటికి వచ్చిన శివకుమార్ భార్య పుష్పను ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పుష్ప తల్లి బీరక లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేశారు.

విజ్ఞాన యాత్రలు అవసరం


శ్రీహరికోటలోని భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను సందర్శించిన విద్యార్థుల బృందం

రాజానగరం: విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞాన యాత్రలు ఎంతో అవసరమని నామవరం లోని భారతీయ విద్యాభవన్ (బీవీబీ) పాఠశాల ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ అన్నారు. శ్రీహరికోటలోని భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను 85 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో కూడిన బృందం శుక్రవారం సందర్శించింది. వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్, రాకెట్లను ప్రయోగించే ప్రదేశాలను అక్కడి పరిశోధకులు వారికి చూపించి, వాటి గురించి వివరించారు. అదే ప్రాంతంలో మ్యూజియాన్ని విద్యార్థులు సందర్శించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ శనివారం విలేకరులకు తెలిపారు.

ఎస్పీ అభినందన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోక్సో కేసుకు సంబంధించి నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష పడడంతో, కేసు దర్యాప్తు చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ పి.జగదీష్ శనివారం అభినందించారు. కొంతమూరు సంతోష్‌నగర్‌లో కూతురిపై లైంగిక దాడి చేసిన కేసు దర్యాప్తులో నిందితునికి శిక్ష పడడంలో ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు, దర్యాప్తు అధికారులు డీఎస్పీ కె.రమేష్‌బాబు, దిశ డీఎస్పీ కె.తిరుమలరావు, రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథం తదితరులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వీరితో పాటు పోక్సో కోర్టు కో ఆర్డినేటర్, దిశ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇ.రమణమ్మ, పోక్సో కోర్టు లైజాన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యకుమార్, రాజానగరం పోలీస్ స్టేషన్‌కు చెందిన కోర్టు కానిస్టేబుల్ ప్రసాద్, సతీష్‌లకు ప్రశంసా పత్రాలు, రివార్డులను ఎస్పీ అందించారు.

సినిమాలు

శ్యామల	:	ఖుషి
సూర్యమినీ	:	దినస్–2
సూర్యప్యాలెస్	:	7జి బృందావన్‌కాలనీ
స్వామి	:	మార్క్ ఆంటోని
శివజ్యోతి	:	మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
అనుశ్రీ	:	ఎక్స్‌పెండబుల్స్
రాజా	:	మార్క్ ఆంటోని
అశోక	:	సప్తసాగరాలు దాటి
ఊర్వశి	:	జవాన్
రంభ	:	దినస్–2
మేనక	:	జైలర్
అప్సర	:	జవాన్
నామవరం		
వీఎస్ మహల్	:	మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మార్క్ ఆంటోని
కడియం		
వెంకటసూర్య	:	మార్క్ ఆంటోని

